క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయంలో కుంకుమ పూజలు



ప్రత్యేక అలంకరణలో మాడుగుల మోదకొండమ్మ

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో శ్రావణ ఆదివారం సందర్భంగా ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. శ్రావణ తొలి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. సుమారు 300 మంది అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదాలతో పాటు తాగునీరు అందించారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మోదమాంబ

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు



స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, తూటిపాల, బూరుగుపాలెం, నగరం, కోడూరు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదాని స్మార్ట్ మీటర్లు వద్దని ప్రసారం నిర్వహించారు. సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రజలపై భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్ బిగిస్తే ఫోన్, టీవీకి ఎలా అయితే రీఛార్జ్ చేసుకోవాలో అలాగా కరెంటుకు రీఛార్జ్ చేసుకునే పద్ధతి వస్తుందన్నారు. అందువల్ల ప్రజలంతా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు.గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడితే బద్దలు కొట్టండి...అని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ప్రజలపై రుద్దడం అన్యాయమన్నారు.

తూటిపాలలో అమ్మవారి పండగ



తలుపులమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, కె.తూటిపాలలో తలుపులమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమను భక్తులు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పండగ సందర్భంగా ఎలాంటి వివాదాలు తలెత్తకుండా గ్రామ పెద్దలు బాధ్యత తీసుకున్నారు.

ఒమ్మలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా సన్యాసిరావు



ప్రమాణ స్వీకారం చేసిన ఒమ్మలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సన్యాసిరావు, డైరెక్టర్లు

మాడుగుల : ఒమ్మలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నందారపు సన్యాసిరావు ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ డైరెక్టర్లుగా చామంతుల రామేశ్వర నరసింగరావు, దర్శిశెట్టి సీతారాం కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంహాచలం నాయుడు, ఉండూరు దేముడు, పుప్పాల రమేష్‌తో పాటు మండలంలో గల 8 పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

తాండవ రోడ్డు.. బాగుపడేదెప్పుడో!



నాతవరం తాండవ మధ్య బురదమయంగా రోడ్డు

జిల్లాలో ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉండే ఈ రహదారిని ఇటీవల ఆర్అండ్‌బీ శాఖలోకి విలీనం చేశారు. అర్అండ్‌బీ అధికారులు ఇటీవల ఆ రోడ్డును పరిశీలించారు. కానీ కనీస మరమ్మతులకు ఇప్పటి వరకూ చర్యలు చేపట్టలేదు. ఈ దారిలో రాకపోకలు సాగించే వారికి నరకం తప్పడం లేదు.

- అడుగడుగునా భారీ గోతులు, బురదమయం
- కనీస మరమ్మతులకూ నోచని వైనం
- రెండు జిల్లాలు, మూడు మండలాలను కలిపే రోడ్డు ఇది
- ఈ రహదారి అభివృద్ధిపై హామీ ఇచ్చిన స్పీకర్
- ఆచరణలో చర్యలు శూన్యం

నాతవరం : స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో తాండవ ప్రధాన రోడ్డు దుస్థితిపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఆ రోడ్డును బాగు చేస్తానని అయ్యన్నపాత్రుడు హామీచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరమ్మతులకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. నాతవరం గ్రామం నుంచి తాండవ రిజర్వాయరు రోడ్డు సుమారుగా 7కిలోమీటర్లు దూరం ఉంది. ఈరోడ్డు తాండవ రిజర్వాయరుకు వెళ్లడానికి ప్రధాన మార్గం కావడంతో పాటు మూడు మండలాలు కలిపే ప్రధాన రోడ్డు కూడా. నాతవరం మండలంలో చమ్మచింత, గంటావారి కొత్తగూడెం, మాధవనగరం, తాండవ, జాలారిపేట, ఉటమల్ల, తాళ్లపాలెం, పొట్టినాగన్నదొరపాలెం గ్రామాల వారు రాకపోకలకు ఇదే ప్రధాన ఆధారం. గొలుగొండ మండలం వెళ్లడానికి ఇది దగ్గర దారి కావడంతో ఈ రోడ్డుపై ఆ మండలంలో పలు గ్రామాలు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి కూడా ఇది దగ్గర దారి. ఈ మండలంలో ఆడాకుల కంతారం, రొంగలి కొత్తూరు, బాలారం, కృష్ణారం, మాడుగుల తదితర గ్రామాలకు కూడా ఇది ప్రధాన మార్గం. ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు నర్సీపట్నం కాలేజీ, ఇతర పాఠశాలలకు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు పెద్ద గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏమాత్రం వర్షం పడినా తారురోడ్డంతా బురదమయంగా మారి వాహనాలు రాకపోకలు సాగించలేనంత విధంగా ఉంటుంది. తుపానులు, భారీ వర్షాల సమయంలో తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటిమట్టం సమయంలో ప్రాజెక్టును సందర్శించడానికి ఆసక్తి చూపే పర్యాటకులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. రోడ్డు దుస్థితి కారణంగా ప్రైవేటు వాహనాలు సైతం సరిగా నడపడం లేదు. అత్యవసర సమయంలో ఈ దారిలో ఆస్పత్రికి వెళ్లాలన్నా అష్టకష్టాలు తప్పడం లేదు.

రోడ్డు దుస్థితి పరిశీలించాం

ఇటీవల తాండవ రోడ్డును డీఈ విద్యాసాగర్, నేను స్వయంగా పరిశీలించాం. మరమ్మతులు చేద్దామంటే స్థానికులు తారురోడ్డు వేయాలి తప్ప మరమ్మతులు వద్దంటున్నారు. మరమ్మతులకు రూ.కోటి 40 లక్షలు అవుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

-నాయుడు, ఆర్అంబీబీ జేఈ



చమ్మచింత వద్ద ప్రమాదకరంగా రహదారిపై గోతులు



ఇటీవల రోడ్డును పరిశీలించిన ఆర్అండ్‌బీ డీఈ విద్యాసాగర్, జేఈ నాయుడు స్థానికులు (ఫైల్)



చాకలి గెడ్డ వద్ద తారు రోడ్డు దుస్థితి

నిత్యం ఇబ్బందులు



రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు అనేక బాధలు పడుతున్నాం. కనీసం రోడ్డుకు మరమ్మతులు కూడా చేయలేదు. పెద్ద గోతులు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ఏమరుపాటుగా వెళ్లిన వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు బాగుచేయాలి.

– సందీప్ ప్రైవేటు ఉద్యోగి చమ్మచింత గ్రామం

అయ్యన్న దృష్టి సారించాలి



తాండవ రోడ్డుని బాగు చేయడంపై స్పీకరు అయ్యన్నపాత్రుడు దృష్టి సారించాలి. ఎన్నికలు ముందు మీరు హామీచ్చారు దానిని అమలు చేయాలి. లేకపోతే మూడు మండలాల ప్రజలతో తాండవ ప్రాజెక్టు అధికారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పవు. కూటమి ప్రభుత్వం కట్టుకథలతోనే కాలం వెళ్లదీస్తుంది తప్ప ఈ రోడ్డు బాగుకు చేసేందేమి లేదు.

–లగుడు నాగేశ్వరరావు, సర్పంచ్ పి.కె.గూడెం

అనాథలకు అన్నదానం



అనాథలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ పూర్ పీపుల్ సభ్యులు

రావికమతం : కొత్తకోటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫర్ పూర్ పీపుల్ సంఘం ప్రతినిధులు బీఎన్ రోడ్డులో సంచరించే దివ్యాంగులు, అనాథలు, భిక్షాటన చేసే 300 మందికి ఆదివారం అన్నదానం చేశారు. సంఘ వలంటీర్లు కొత్తకోట నుంచి రోలుగుంట, కంచుగుమ్మల, నిండుగొండ, వెంకాయలపాలెం, చెట్టుపల్లి, నర్సీపట్నంవరకు, పెద్ద బొడ్డేపల్లి, కొవ్వూరు గ్రామాలలో గల వృద్ధాశ్రమంలోనూ అన్నదానం చేశారు. దివ్యాంగులకు, అనాథలకు, భిక్షాటన చేసేవారికి ఆకలి తీర్చడమే తమ సంస్థ ధ్యేయమని, గత రెండు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం చేస్తున్నామని సంఘ సభ్యులు తెలిపారు.

ఘనంగా పసలమారమ్మ పండగ



పండగలో అమ్మవారికి సారె ఊరేగిస్తున్న గ్రామస్తులు

చీడికాడ: వరహాపురం గ్రామంలో ఆదివారం ఉదయం పసలమారమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఖరీఫ్ వరినాట్లకు ముందు పశువులను పూజించడం ఆనవాయితీగా వస్తుందని సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు తెలిపారు. ఆరుగాలం రైతులకు అండగా నిలుస్తూ కుటుంబంలో భాగంగా ఉండే పాడి పశువులను పూజించడం రైతులకు పశువుల పట్ల గల కృతజ్ఞతను తెలియజేస్తుందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఈ మేరకు పసలమారమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు



దేవరాపల్లిలోని ఎరువుల దుకాణంలో నిల్వలను తనిఖీ చేస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ దుకాణదారులను హెచ్చరించారు. మండలంలోని లైసెన్స్ ఎరువుల దుకాణాలను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. దేవరాపల్లిలోని హేమ రైతు డిపో, మన గ్రోమోర్, కాశీపురంలోని శ్రీలక్ష్మీనారాయణ, వెంకట రోహిణి లైసెన్స్ ఎరువుల దుకాణాలలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. బిల్లు బుక్, స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దుకాణాల ఎదుట ఎరువుల ధర పట్టిక ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. రైతు విస్తీర్ణం ఆధారంగా ఎరువులు విక్రయించాలని, ఎరువులు కొనుగోలు చేసే రైతుల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు షాపు మూసే ముందు ఎన్ని బస్తాలు నిల్వ ఉన్నాయో స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో 24 టన్నులు, కలిగొట్ల పీఏసీఎస్‌లో 24 టన్నులు, ప్రైవేటు దుకాణాల్లో 40 టన్నులు మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్థలాల లీజు ప్రతిపాదన విరమించుకోవాలి



డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ ఉద్యోగులు

నర్సీపట్నం : ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఎన్‌ఎంయూ రీజియన్ అధ్యక్షులు రాజు, డిపో కార్యదర్శి జి.ఎస్. నారాయణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. మాల్ స్థలాలకు ఆర్టీసీ స్థలాలను ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే ప్రతిపాదన విరమించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పి.కె.రావు, ఎస్.రావు, మూర్తి, సంజీవి, కృష్ణ పాల్గొన్నారు.


అక్రమంగా మద్యం విక్రయంపై కేసు నమోదు



పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్ఐ భీమరాజు

నాతవరం : మండలంలో జిల్లేడుపూడి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామని నాతవరం ఎస్ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్టుగా మాకు అందిన సమాచారంతో దాడులు చేసి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నామన్నారు. నిందితుడి వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండల వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయించే గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

గ్రామాల్లో అరకొరగా వరినాట్లు



సత్యవరంలో నాట్లు కోసం వరినారు తీస్తున్న రైతులు

మాడుగుల : మండలంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు వల్ల ఖరీఫ్ వరినాట్లు ఆలస్యమైంది. వ్యవసాయ బావులతో పాటు పంట చెరువులు నిండకపోవడంతో వ్యవసాయ మోటారులు వద్ద అక్కడక్కడ వరి నాట్లు ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నా సరే వరుణుడు కరుణించలేదని, రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది మండలంలో సాధారణ ఖరీఫ్ వరి సాగు 11,500 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 500 ఎకరాలు కూడా వరినాట్లు దాటలేదని రైతులు చెబుతున్నారు. వరినారు కూడా సక్రమంగా నాటక పోవడంతో రెండో దఫా వేశారు. నారులు వేసి నెల దాటిపోతున్నా సరే వర్షాలు అనుకూలించక మెట్ట ప్రాంతాల్లో వరి సాగు చేయవలసిన భూములు బీడుగా మారుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి సహాయం అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

నువ్వు పంట నూర్పుల్లో రైతులు బిజీబిజీ

గొలుగొండ : నువ్వు పంట నూర్పుల్లో రైతులు బిజిబిజీగా ఉన్నారు. వారం రోజులు నుండి తుపాను ప్రభావం కారణంగా ఇబ్బందులు పడిన రైతులు ఆదివారం పూర్తి స్థాయిలో ఎండ రావడంతో నువ్వు పంటను నూర్పులు చేస్తున్నారు. ఎండలు అనుకూలంగానే ఉంటేనే ఈ పంట చేతికందుతుందని వర్షాలు కురిస్తే పంట నాశనం అవుతుందని రైతులు అంటున్నారు. మండలంలో కొత్తపాలెం, గొలుగొండ, చిన్నయ్యపాలెం, కొత్తమల్లంపేట తదితర గ్రామాల్లో సుమారుగా 400 ఎకరాల్లో పంట వేశారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడికి నేతల అభినందనలు



బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న పార్టీ నాయకులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, గిడుతూరు గ్రామానికి చెందిన శీరంరెడ్డి సూర్యనారాయణ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనకు బీజేపీ నాయకులు రాంబాబు, మగ్రి నాయుడు, బాబురావు, జమీలు, ఆంజనేయులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

నూతన ఆలయ కమిటీ ఎన్నిక



గౌరీపరమేశ్వరుల ఆలయ నూతన కార్యవర్గం

అనకాపల్లి: వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గరికి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆలయ ప్రధాన కార్యదర్శిగా నానేపల్లి రవి, ఉపాధ్యక్షులుగా పెదిరెడ్ల నాగు, ధరిశెట్టి చిన్న, కార్యదర్శులుగా వి.పాపయ్యశెట్టి, పద్మనాభం శంకర్, కోశాధికారిగా పోతల రమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గరికి వెంకటరావు మాట్లాడుతూ నూతన కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. వచ్చే నెల 27న గణపతి నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీధి పెద్దలు వాకాడ బాబు, వేల్పుల గణేష్, మద్దాల కూర్మారావు, గుమ్మాల నాగేశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, మద్దాల నూకరాజు, వాకాడ నర్సింగరావు, బొద్దపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంబిస్తున్న క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు

అనకాపల్లి: క్రీడలు ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని, మానసిక ఉల్లాసం కలుగుతుందని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు తెలిపారు. ఆగస్టు 3న అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్ ఆవరణలో క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వివిధ రకాలైన క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు క్లబ్ సభ్యుడు, వైద్యుడు డి.డి.నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పి.ఎస్. అప్పారావు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో...



గొండుపాలెంలో కలుసుకున్న 2001-02 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కె.కోటపాడు : మండలంలో చౌడువాడ, గొండుపాలెం గ్రామాల్లో గల హైస్కూళ్ల చదువులు సాగించిన పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక పేరుతో కలుసుకున్నారు. గొండుపాలెం హైస్కూల్లో 2001-02 ఏడాది వరకూ చదువులు సాగించిన నాటి పూర్వపు విద్యార్థులు మరలా 24 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. నాడు పాఠశాలల్లో చదువుకున్న రోజులతో పాటు అల్లరి, ఆటల, పాటలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ప్రతి ఏడాదికి ఒక రోజు పూర్వపు విద్యార్థులు ఆత్మీయ కలయిక కార్యక్రమంతో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. తోటి స్నేహితులైన పూర్వపు విద్యార్థుల కష్టసుఖాలలో పాలు పంచుకోవాలని వీరంతా నిర్ణయించుకున్నారు. కూండ్రపు సత్యనారాయణమూర్తి, రమేష్, శ్రీరామమూర్తి, నాని, సంతోష్, నాగేష్, శ్రీలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చౌడువాడ హైస్కూల్ 2013–14 బ్యాచ్ విద్యార్థులు..

చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013–14 విద్యాసంవత్సరంలో పది వరకూ చదువులు సాగించిన విద్యార్థులు ఆత్మీయ కలయిక పేరుతో కలుసుకున్నారు. వీరంతా అడ్డూరు మజ్జి గైరమ్మ ఆలయం వద్ద ఈ కలయిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చదువులు పూర్తయిన 11 ఏళ్ల తరువాత వీరంతా మొదటి సారిగా కలుసుకోవడంతో వీరంతా ఆనందంగా ఒకరినొకరు పలకరించుకొని, నాటి గుర్తులను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం నాటి చదువుల తరువాత ఉన్నత చదువులను సాగిస్తున్న వారు కొందరైతే, ప్రభుత్వ, ప్రైవేట్, వ్యవసాయ రంగాల్లో రాణిస్తున్నామంటూ నాటి విద్యార్థులు తమ తోటి స్నేహితులకు వివరించారు. ప్రతి ఏటా కలుసుకోవడంతో పాటు పాఠశాల అభివృద్ధిలో తమ బ్యాచ్ తరపున పాలు పంచుకోవాలని వీరంతా నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.నవీన్, డి.పైడినాయుడు, మిర్తిపాటి శివ, పచ్చికూర చక్రవర్తి, గాడి రవి, మాలతి పాల్గొన్నారు.



11 ఏళ్ల తరువాత కలుసుకున్న చౌడువాడ జెడ్పీ స్కూలు పూర్వ విద్యార్థులు

అధ్వానంగా ధారమఠం రోడ్డు



ధారమఠం రోడ్డు దుస్థితి

గొలుగొండ : ప్రముఖ శైవక్షేత్రమైన ధారమఠం శివాలయంకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. భక్తులు పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వాహనాలు వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి మరమ్మతులకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టడం లేదు. ధారమఠం శివాలయంతో పాటు ఈ రోడ్డుపై కొత్తపాలెం, ధారపాలెం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు చర్యలు తీసుకొని ఈ రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.